23న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాక



భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రపతి **ద్రౌపదీ ముర్ము** ఈ నెల 23న రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. ఆమె 23న తన సొంత జిల్లా మయూర్‌భంజ్ వస్తారు. ఉదయం 9.55 గంటలకు స్వస్థలం రాయ్‌రంగపూర్‌లోని నివాస గృహానికి చేరుకుంటారు. రాత్రి అక్కడే ఉంటారు. 24 ఉదయం 10.45 గంటలకు పూరీ చేరుకుంటారు. తాలబణియాలోని తాత్కాలిక హెలిప్యాడ్‌లో దిగనున్న ఆమె నేరుగా పూరీ శ్రీక్షేత్రానికి వెళతారు. జగన్నాథుని సన్నిధిలో పూజలు చేస్తారు. 11.50 వరకు శ్రీక్షేత్రంలో ఉంటారు. అనంతరం పూరీలోని గోపబంధు ఆయుర్వేద కళాశాల రజతోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. తరువాత పూరీ రాజ్‌భవన్‌లో మధ్యాహ్న భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు భువనేశ్వర్ వస్తారు. రాష్ట్ర వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ) వార్షికోత్సవంలో పాల్గొంటారు. అనంతరం భువనేశ్వర్‌లో కొత్తగా నిర్మాణమైన జ్యుడీషియల్ కాంప్లెక్స్ భవన సముదాయం ప్రారంభిస్తారు. రాత్రి 7 గంటలకు వాయుసేన విమానంలో దిల్లీ ప్రయాణమవుతారు.

సేవల్ని విస్తృతం చేయండి



ఏకరూప దుస్తుల్ని ఆవిష్కరించి ప్రదర్శిస్తున్న మంత్రి బిభూతి జెనా. చిత్రంలో పరిషత్ ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణతోపాటు పశుపక్ష్యాదుల సంరక్షణకు సేవల్ని మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర ఉక్కు, గనులు, రవాణా శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా పిలుపునిచ్చారు. గంజాం జిల్లా కుకుడాఖండి సమితిలోని గుంఠొబొంధొ గ్రామానికి చెందిన 'ఆంచలిక వికాస్ పరిషత్' 14 ఏళ్లుగా పిచ్చుకలు, ఇతర పక్షులు, పర్యావరణ పరిరక్షణకు ఉద్యమిస్తోంది. ఆ సంస్థ నూతన ఏకరూప దుస్తుల ఆవిష్కరణ మంగళవారం జరిగింది. ఉదయం గంజాం జిల్లా గొళంత్రాలోని వందేమాతరం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి జెనా దుస్తుల్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు సాగర్ కుమార్ పాత్ర్, ఇతర ప్రతినిధులు బిజేంద్ర మాఝి, బనమాలి ప్రధాన్, పి.అరవింద దేశిబెహరా తదితరులు పాల్గొన్నారు.

సునాబెడలో విజృంభిస్తున్న డెంగీ వ్యాధి



వైద్య కళాశాలలో నేలపై చికిత్స పొందుతున్న డెంగీ వ్యాధి సోకిన యువకుడు

నెల రోజుల్లో ఐదుగురి మృతి

50 మందిలో వ్యాధి లక్షణాలు




డీపీ క్యాంప్‌లో దోమల నివారణకు పొగ వెదజల్లుతూ...

సిమిలిగుడ, న్యూస్‌టుడే

కొరాపుట్ జిల్లాలో డెంగీ వ్యాధి పీడితుల సంఖ్య పెరుగుతోంది. గతంలో ఏటబీలోని నారాయణపట్నంలో డెంగీ వ్యాధి వ్యాపించిన విషయం తెలిసిందే. తాజాగా సునాబెడలో ప్రబలడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజులుగా పలువురిలో వ్యాధి లక్షణాలు గుర్తించడంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా డీపీ క్యాంపులో డెంగీ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. దీని బారిన పడిన వారి శరీరంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య క్రమంగా తగ్గుతూ జ్వరంతో బలహీనంగా మారుతున్నారు. చర్చ్ కాలనీకి చెందిన హీరాకూల్‌దీప (42) అనే మహిళ ఈ వ్యాధితో మంగళవారం మృతి చెందింది. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. నెల రోజుల్లో అయిదుగురు మృతి చెందగా, 50 మంది వ్యాధి బారిన పడ్డారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కాకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో పలువురు చికిత్స పొందుతున్నారు. ఎక్కువమంది విశాఖపట్నంలో వైద్యం చేయించుకుంటున్నారు. డీపీ క్యాంప్‌తోపాటు గంజాం కాలనీ, జాడగుడ, సిమిలిగుడ పట్టణంలో వ్యాధి పీడితులున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరడంతో ఎంతమంది వ్యాధి బారిన పడ్డారో లెక్కలు తెలియడం లేదు. జయపురం, కొరాపుట్, సునాబెడ పురపాలక సంస్థ పరిధిలో ఇదే పరిస్థితి. జిల్లాలో ఇప్పటికి 280 మందికి వ్యాధి సోకగా గత నెల రోజుల్లో ఏడుగురు మృతి చెందినట్లు జిల్లా ముఖ్య వైద్యాధికారి కార్యాలయం వర్గాలు తెలిపాయి.

దిగజారుతున్న పారిశుద్ధ్యం

పురపాలక సంస్థకు చెందిన వివిధ వార్డుల్లో పారిశుద్ధ్యం రోజురోజుకూ దిగజారుతోంది. వార్డు కౌన్సిలర్ నిర్లక్ష్యం దీనికి కారణం. సిబ్బంది వీధుల్లో సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండంతో దుర్వాసన వెలువడుతోంది. దోమల బెడద పెరిగింది. సూర్యనగర్, డీపీ క్యాంప్, గంజాం కాలనీ, మాలిగుడ, జాడగుడ, చర్చ్ కాలనీ ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. రోజుల తరబడి పారిశుద్ధ్య పనులు చేపట్టకపోయినా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. దీంతో వ్యాధి తొందరగా వ్యాపిస్తోంది.



దిగజారిన పారిశుద్ధ్యం



ప్రత్యేక వైద్య కౌంటర్

ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాం

సునాబెడ పురపాలక సంస్థ పరిధిలో అనేక ప్రాంతాల్లో డెంగీ వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. డీపీ క్యాంపులో ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభించాం. ఇంటింటా కరపత్రాలతో చైతన్యం కలిగిస్తున్నాం. వైద్య సిబ్బంది నిల్వ ఉన్న నీటిపై దృష్టి పెట్టి దోమలు లేకుండా చూస్తున్నారు. మూడు వైద్య శిబిరాలు నిర్వహించాం. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచిస్తున్నాం. చైతన్య లోపంతోనే వ్యాధి వ్యాపించింది. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

- నారాయణ నాయక్, కార్యనిర్వాహక అధికారి పురపాలక సంస్థ సునాబెడ

ముంబయిలో పెట్టుబడుల సదస్సు: సంపద్



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 18, 19 తేదీల్లో ముంబయిలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించనుంది. ఇందులో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, పరిశ్రమల శాఖ మంత్రి **సంపద్ స్వయిన్**, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారు. మంత్రి సంపద్ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రం 18న ముంబయిలో 'ఇండియాకేం' పేరిట సదస్సు నిర్వహిస్తోందని, కార్యక్రమంలో కేంద్రమంత్రులు, విదేశీ పెట్టుబడిదారులు పాల్గొంటారన్నారు. గోపాల్‌పూర్, పరదీప్, ధమ్రా ఓడరేవులకు అనుబంధంగా ప్రముఖ కంపెనీలు రసాయనాల పరిశ్రమల స్థాపన ధ్యేయంగా పెట్టుకున్నాయన్నారు. దీనిపై తొలిరోజు సదస్సులో చర్చ జరుగుతుందన్నారు. 19న రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో 300 మంది పారిశ్రామిక గ్రూపుల ప్రతినిధులు, వాణిజ్య బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. ఇందులో టెక్స్‌టైల్స్, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఉక్కు, అల్యూమినియం పరిశ్రమల ఏర్పాటుపై చర్చిస్తారన్నారు. కేంఝర్‌లో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకున్న ముఖ్యమంత్రి సీఎస్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ బృందం ప్రారంభించినట్లు చెప్పారు.

బైజయంత్‌కు 'దిల్లీ' బాధ్యతలు



బైజయంత్ పండా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడ ఎంపీ, భాజపా కేంద్రశాఖ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండాకు ఆ పార్టీ కేంద్ర నాయకత్వం మంగళవారం దిల్లీ ఎన్నికల పర్యవేక్షకునిగా (ఇన్‌ఛార్జి) నియమించింది. పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఈమేరకు బాధ్యతలు అప్పగించారు. బైజయంత్ గతంలో అసోం ఎన్నికల ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహించారు.

నీటి సంరక్షణలో ఒడిశా భేష్

★ దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిన రాష్ట్రం ★ 5వ జాతీయ జల అవార్డులను ప్రకటించిన కేంద్రం



సమావేశంలో వివరాలు ప్రకటిస్తున్న కేంద్రమంత్రి పాటిల్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నీటి సంరక్షణకు మన రాష్ట్రం తీసుకుంటున్న చర్యలు అభినందనలు అందుకున్నాయి. ఈ అంశంలో దేశవ్యాప్తంగా ఒడిశా అగ్రస్థానంలో నిలిచి ఆదర్శంగా నిలిచింది. 5వ జాతీయ జల అవార్డులను సోమవారం కేంద్రం ప్రకటించింది. దిల్లీలోని శ్రమ్‌శక్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ అవార్డులను ప్రకటించారు. అక్టోబరు 22న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వీటిని విజేతలకు బహూకరిస్తారు. మన రాష్ట్రం తర్వాత ఉత్తరప్రదేశ్ ద్వితీయ స్థానం, గుజరాత్, పుదుచ్చేరి సంయుక్తంగా తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఒడిశాలో ముఖ్యమంత్రి ఆదిబొంధొ తియారి యోజన కింద చెక్‌డ్యాంల నిర్మాణం, అభివృద్ధి, సూక్ష్మ నీటి పారుదల మెరుగు వంటి చర్యలు నీటి సంరక్షణకు బాగా దోహదపడ్డాయి. జిల్లాలపరంగా చూస్తే బొలంగీర్, పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బి) కేటగిరిలో పూరీ పురపాలక సంస్థ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. గ్రీన్ మహానది మిషన్ కింద 167 నదీ కరకట్టల నిర్మాణం, 241 హెక్టార్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. 260 చెరువులు, 170 చెక్‌డ్యాంలు, 160 నీటి మళ్లింపు నిర్మాణాలు, 1320 నీటి సంరక్షణ కట్టడాలు 2023లో జరిగినట్లు గణాంకాలు పేర్కొన్నాయి. వీటితోపాటు 460 ట్యాంకులు, 670 భూగర్భ జలాల స్థాయి పెంపు కట్టడాలు పూర్తిచేయడం గమనార్హం.



సాగునీటి సంరక్షణకు నిర్మించిన చెక్‌డ్యాం

53 వేలకుపైగా కట్టడాలు పూర్తి

రాష్ట్రంలో నీటి సంరక్షణ, వర్షం నీటిని ఒడిసిపట్టడం వంటి కార్యక్రమాల కోసం 53 వేలకుపైగా కట్టడాలు పూర్తిచేసినట్లు ప్రభుత్వ దస్త్రాలు పేర్కొంటున్నాయి. వీటితోపాటు 11 వేలకు పైగా సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, అదనంగా 21 వేల వ్యర్థ జల శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 90,900 హెక్టార్లకు పైగా సాగు భూమికి సూక్ష్మ నీటిపారుదల సౌకర్యం కల్పించడంతో 87 వేల మంది అన్నదాతలకు లబ్ధి చేకూరుతున్నట్లు ప్రభుత్వ రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఉత్తమ పాఠశాల కేటగిరీలో నీటి సంరక్షణ చర్యలకు మయూర్‌భంజ్ జిల్లా బైసింగలోని ఖాయిర్బాని ఆశ్రమ పాఠశాల తృతీయ స్థానంలో నిలిచి అవార్డు సొంతం చేసుకుంది. ఇక్కడ పాఠశాల పైకప్పుపై వర్షం నీటిని ఒడిసిపట్టి, ఆ నీటితో పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెలను అభివృద్ధి చేస్తుండడం గమనార్హం. వాన నీటి సంరక్షణ-ప్రయోజనాల అంశమై పాఠశాల విద్యార్థులు తరచూ స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో దీనికి అవార్డు లభించింది. నీటి సంరక్షణ చర్యల్లో మన రాష్ట్రానికి మూడు అవార్డులు దక్కడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దిల్లీలో పూరీ యువతిపై అత్యాచారం

సమగ్ర దర్యాప్తునకు సీఎం ఆదేశం



మోహన్‌చరణ్ మాఝి



ఎస్.షైనీ

గోపాలపూర్, రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: దేశ రాజధాని నగరం దిల్లీలో మరో అమానుష ఘటన జరిగింది. పూరీకి చెందిన 34 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. బాధితురాలు రెండు రోజులుగా ఎయిమ్స్‌లోని ఐసీయూలో చికిత్స పొందుతోంది. ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) మంగళవారం అందిన వివరాల మేరకు ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. మానసికంగా ఆందోళనతోనే ఉంది.

మూడు రోజులుగా దర్యాప్తు

శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు పెట్రోలింగ్ చేస్తున్న దిల్లీ పోలీసులు కటబరియా సొరై ప్రాంతంలో చిరిగిన వస్త్రాలు, గాయాలతో స్పృహతప్పి పడి ఉన్న యువతిని గుర్తించారు. సన్‌లైట్ కాలనీ ఠాణా అధికారులకు తెలియపరిచారు. రక్తంలో తడిసి ముద్దయి ఉన్న బాధితురాలని ఎయిమ్స్‌లో చేర్పించారు. ఈ నిస్సహాయ యువతిపై దుండగులు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె ఒడియా యువతి అని తెలిసిన తరువాత దిల్లీలోని ఒడిశా కమిషనర్ విశాల్‌గగన్‌కు తెలియపరిచారు. అనంతరం దిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరా, విశాల్ గగన్‌లు ఎయిమ్స్‌కు వెళ్లి బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ అమానుష ఘటనకు పాల్పడిన వారు ఎవరు? ఎంతమంది అన్నదానిపై మూడు రోజులుగా దర్యాప్తు జరుగుతోంది. నిందితుల ఆచూకీ తెలియలేదు.

దిల్లీ చేరుకున్న కుటుంబీకులు

బాధితురాలు పూరీకి చెందిన యువతిగా తెలిసింది. ఆమె నర్సింగ్ కళాశాలలో చదువు పూర్తి చేసుకున్న తరువాత దిల్లీలోని ఒక ఆసుపత్రిలో కొన్నాళ్లు విధులు నిర్వహించింది. కొంతకాలంగా ఈ ఆసుపత్రి వీడిన ఆమె ఆర్థికపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అద్దె కట్టలేక ఇంటినీ ఖాళీ చేసింది. దీంతో ఆమె నిరాశ్రయురాలైంది. దీన్ని అదనుగా తీసుకున్న దుండగులు దుర్మార్గానికి పాల్పడ్డారు. దీనిపై ఒడిశా డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా సోమవారం దిల్లీ పోలీసు కమిషనర్ సంజయ్ అరోరాతో మాట్లాడారు. దిల్లీ సౌత్ ఈస్ట్ ప్రాంత డీసీపీ రవికుమార్ సింగ్ స్వయంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కటబరియా సొరై ప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో బాధితురాలి కుటుంబీకులు సోమవారం దిల్లీ చేరుకున్నారు. వారికి ఒడిశా భవన్‌లో ఆశ్రయం కల్పించారు.

దిల్లీ వెళ్లిన షైనీ

ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఈ ఘటన తెలిసిన తరువాత ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. మరోవైపు ఆయన ఆదేశాల మేరకు మహిళా, శిశు సంక్షేమశాఖ ఐజీ ఎస్.షైనీ మంగళవారం దిల్లీ వెళ్లారు. ఆమె అక్కడి ఉన్నతాధికారులతో మాట్లాడతారు. బాధితురాలి పరిస్థితి పరిశీలిస్తారు. చికిత్స పొందుతున్న ఆమె స్వల్పంగా కోలుకున్నా, నాటి రాత్రి ఘటనపై ఏమీ చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు తెలిసింది. మానసికంగా చితికిపోయిన బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని సుప్రీంకోర్టు న్యాయవాది రాధాకాంత్ త్రిపాఠి కేంద్ర మానవహక్కుల కమిషన్‌కు లిఖితపూర్వకంగా కోరారు. దిల్లీ పోలీసులు దీన్ని తీవ్రంగా పరిగణించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

పాండ్యన్ వల్లే బిజదను వీడాను: ప్రసన్న పట్నానీ



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించి, నవీన్ పట్నాయక్‌కు మార్గదర్శిగా వ్యవహరించిన తాను ఆ పార్టీ వీడి భాజపాలో చేరడానికి కారణం వి.కార్తికేయ పాండ్యన్ అని సీనియర్ నేత ప్రసన్న పట్నానీ చెప్పారు. వరుసగా అయిదుసార్లు భువనేశ్వర్ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన తాను బిజద ఎదుగుదలకు ఎంతో చేశానన్నారు. పాండ్యన్ ప్రవేశంతో అంతా తారుమారైందని, పార్టీ గౌరవం కోల్పోయిందని, పరాజయంపై ఇప్పటికీ తాను బాధపడుతున్నానన్నారు. రాజకీయ సన్యాసం తీసుకున్నానని గతంలో చెప్పిన పాండ్యన్ తెరవెనుక ఉంటూ బిజదను నడిపిస్తున్నారన్నారు. నవీన్ గుడ్డిగా ఆయననే నమ్ముతున్నారన్నారు. తన మిత్రుడు అమర్‌ప్రసాద్ శత్పథి ఈ విషయమై ఆవేదన వ్యక్తం చేశారని, బిజదలో నెలకొన్న పరిణామాలు ఎంతో మంది సీనియర్ నేతలకు దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయన్నారు. సమీప భవిష్యత్తులో మరికొందరు నాయకులు పార్టీ వీడే అవకాశం ఉందన్నారు. జనాదరణలో ఒకప్పుడు అగ్రగామిగా నిరూపించుకున్న ప్రాంతీయ పార్టీ నిరాదరణకు గురి కావడానికి పాండ్యనే కారణమని, నవీన్ ఆయనను వదలకపోవడం దురదృష్టకరమని పట్నానీ చెప్పారు.

పార్టీకి ద్రోహం చేశారు: లెనిన్ మహంతి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాబా ప్రసన్న పట్నానీని బిజద అధినేత నవీన్‌పట్నాయక్ ఎంతగానో గౌరవించారని, సీనియర్ నాయకునిగా మర్యాద ఇచ్చారని బిజద అధికార ప్రతినిధి లెనిన్ మహంతి చెప్పారు. మంగళవారం సాయంత్రం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారమే పరమావధిగా చేసుకున్న బాబా తన అల్లుడు, మేనల్లుడు, ఇతర బంధుగణానికి గత ఎన్నికల సమయంలో టికెట్లు కేటాయించాలని నవీన్‌ను కోరారన్నారు. నిరాకరించడంతో పార్టీ వీడిన ఆయన ప్రసార సాధనాల ముందు విమర్శలు చేస్తున్నారని, పెద్దాయనకిది తగదన్నారు. మృదు స్వభావం గల నవీన్ సీనియర్ నాయకులందర్నీ గౌరవిస్తున్నారని, ఎవర్నీ ఎన్నడూ తూలనాడలేదని మహంతి అన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో త్వరలో పెనుమార్పులు: అమర్‌ప్రసాద్ శత్పథి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకోనున్నాయని, సమీకరణాలు మారుతాయని బిజదకు దూరమైన అగ్రనేత అమర్‌ప్రసాద్ శత్పథి చెప్పారు. మంగళవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో భాజపా ఎదుగుదలకు బిజదలో నెలకొన్న పరిణామాలు కారణమయ్యాయన్నారు. నవీన్ స్వీయ తప్పిదాలతో బిజద అధికారానికి దూరమైందన్నారు. ఆ తర్వాత కూడా అధినేత పరిస్థితి సమీక్షించకుండా, పరాజయానికి కారణమైన వారికి పెత్తనం ఇస్తున్నారన్నారు. బిజద ఆవిర్భావంలో కీలకమైన నేతలంతా పార్టీ వీడారని, ముఖస్తుతి చేస్తున్న కొందరు నవీన్ వద్ద ఉన్నారన్నారు. దీని పరిణామాలు భిన్నంగా ఉంటాయని, ఎన్నో మార్పులు, చేర్పులకు దారి తీస్తాయన్నారు. భాజపా సంఖ్యాబలం పెరగడానికి అనుకూలిస్తాయన్నారు. తాను భాజపాలో ఎప్పుడు చేరేది ఇప్పుడే చెప్పలేనని శత్పథి పేర్కొన్నారు.

80 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



సమావేశంలో సీఎం మోహన్, ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 80 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం భువనేశ్వర్ లోక్‌సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడ, మంత్రులు సురేష్‌పూజారి, కృష్ణచంద్ర పాత్ర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దూరదృశ్య శ్రవణ మాధ్యమంలో 30 జిల్లాల పాలనాధికారులు, పౌరసరఫరాలు, సహకార శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి సురేష్ పూజారి విలేకర్లకు తెలిపిన వివరాల మేరకు... క్వింటా ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ₹2,300 గిట్టుబాటు ధర ప్రకటించింది. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.800లు బోనస్‌గా చెల్లిస్తుంది. మొత్తంగా రూ.3,100లు చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు ప్రారంభంతో ఇరుగు పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో అప్రమత్తం చేస్తారు. ఇతర రాష్ట్రాల రైతులు ఒడిశాలో ధాన్యం విక్రయించకుండా గట్టి చర్యలు తీసుకుంటారు. ఇదివరకు ధాన్యం నాణ్యత పరిశీలన మండీలు, మిల్లుల్లో రెండుచోట్లా జరిగేవి. ఇకపై కేవలం మండీలో మాత్రమే పరిశీలిస్తారు. అక్కడ ఆహార, పౌర సరఫరాలు, సహకార, రెవెన్యూ శాఖల అధికారులు సూపర్‌వైజర్‌లుగా నియమితులవుతారు. అవినీతి, అక్రమాలు జరగకుండా పర్యవేక్షిస్తారు. వారి సమక్షంలోనే కొనుగోళ్లు జరుగుతాయి. ఆయా జిల్లాల పాలనాధికారులు తరచూ మండీలకొచ్చి పరిస్థితి సమీక్షిస్తారు. రాష్ట్రానికి చెందిన మంత్రులకు రెండు లేక మూడు జిల్లాల బాధ్యతలు అప్పగిస్తారు. వారు ధాన్యం మండీలు సందర్శించి అన్నదాతలతో మాట్లాడతారు. ఇబ్బందులు అధ్యయనం చేసి సత్వర చర్యలు తీసుకుంటారు. ₹550 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని మండీలన్నీ ఆధునికీకరణ చేస్తారు. ధాన్యం కొనుగోలు తరువాత 48 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. తూకాలు, కొలతల్లో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం గట్టి బందోబస్తు చేస్తుంది. ధాన్యం కొనుగోలు వ్యవధి ఆయా జిల్లాల పాలనాధికారులు పెంచగలుగుతారు.

166 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం


భువనేశ్వర్, న్యూస్‌టుడే: గంజాయి అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో సంబల్‌పూర్ అబ్కారీ అధికారులు తనిఖీలు చేయడానికి వెళ్లి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సంబల్‌పూర్, రాంచీ బిజు ఎక్స్‌ప్రెస్ రహదారిలో మంగళవారం మధ్యాహ్నం ఒక కారులో గంజాయి అక్రమంగా రాంచీకి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న సిబ్బంది మఝిపల్లి చెక్‌గేటు వద్ద కాపు కాశారు. కారు రావడంతో ఆపి తనిఖీ చేయగా సీట్ల కింద మూడు అట్టపెట్టెల్లో 166 కిలోల వెండి ఆభరణాలు కనిపించాయి. దీనిపై సంబల్‌పూర్ వాణిజ్య పన్నుల (జీఎస్టీ) శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియపరిచారు. జీఎస్టీ అధికారుల పరిశీలనలో ఈ ఆభరణాలకు సంబంధించి బిల్లుల్లేవని నిర్ధారణ అయింది. మహారాష్ట్ర నుంచి ఈ సామగ్రి రాంచీ (ఝార్ఖండ్)కి వెళుతున్నట్లు అధికారులు గుర్తించారు. కారులో సామగ్రి తెస్తున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

మా కాళువాకు జై!



తాత్కాలిక మందిరంలో కొలువైన అమ్మవారు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గుసానినువాగాంలోని సుప్రసిద్ధ 'మా కాళువా యాత్ర' చివరి దశకు చేరుకుంది. ఇక్కడి పెద్ద వీధిలోని తాత్కాలిక మందిరంలో కొలువైన తల్లిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రతిరోజు సాయంత్రం పెద్దవీధిలో సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నారు. యాత్ర నేపథ్యంలో గుసానినువాగాంలోని వివిధ వీధులను విద్యుద్దీపాలతో దివ్యంగా అలంకరించి, అడుగడుగునా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. కుమార పౌర్ణమి ముగింపు యాత్ర బుధవారం రాత్రి జరుగుతుంది. ఇందుకోసం యాత్ర నిర్వహణ కమిటీ ప్రతినిధులు విస్తృత ఏర్పాట్లు చేశారు.



సాంస్కృతికోత్సవాలు తిలకిస్తున్న ప్రజలు

శ్రీక్షేత్రంలో ద్వాదశి సేవలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో ఆశ్వీయుజ శుక్ల పక్షమి ద్వాదశి పురస్కరించుకుని మంగళవారం జగన్నాథ, బలభద్ర, సుభద్రల సన్నిధిలో ద్వాదశి సేవలు జరిగాయి. ఉదయం మంగళహారతి, మైలం, అబకాశ, గోపాలవల్లభ సేవల తరువాత సేవాయత్‌లు పురుషోత్తమునికి రాధాదామోదరునిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక సేవలు చేపట్టారు. ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది.

రెండు వర్గాల ఘర్షణలో బాలుడు మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: పట్టణంలో సోమవారం రాత్రి దుర్గమ్మ నిమజ్జన కార్యక్రమంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు కిశోర బాలురకు గాయాలయ్యాయి. ఒకరు చికిత్స పొందుతుండగా మరొకరు మంగళవారం ఉదయం మృతి చెందారు. దీంతో ఆ వర్గానికి చెందిన వందలాది మహిళలు, పురుషులు ఆసుపత్రితో పాటు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని నిందితులని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీపీఓ కృష్ణచంద్ర బొత్ర తెలిపిన వివరాల ప్రకారం దుర్గమ్మ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న రెండు వర్గాల మధ్య ఏదో విషయమై వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో దండాసి సాహికి చెందిన కిరణ్ గద్బ(16), తేజబ హరిజన్ కత్తిపోట్లకు గురయ్యారు. క్షతగాత్రులను పోలీసులు తక్షణం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కిరణ్ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కిరణ్‌కు తల్లిదండ్రులు లేరు, ఒక చెల్లి ఉంది. ఈ కేసుకు సంబంధించి నిందితులు ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

మరొకరు...: జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితిలో వేర్వేరు చోట్ల జరిగిన రహదారి ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఐఐసీ ఈశ్వర్‌తాండి తెలిపిన వివరాలు ప్రకారం కుంద్రా సమితి పుపుగావ్ పంచాయతీ కందులగూడ గ్రామానికి చెందిన మకర మలి(19), నవీన్ భూమియా సోమవారం రాత్రి బొరిగుమ్మ నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా అంబాగూడ చౌక్ వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. మకర అక్కడికక్కడే మృతి చెందగా, నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా ప్రధానాసుపత్రిలో చేర్చగా, అనంతరం వైద్యుల సూచనల మేరకు కొరాపుట్ ఆసుపత్రికి తరలించారు.

● జయపురం సమితి అంతా పంచాయతీ సువారిగుడ గ్రామానికి చెందిన లుకు జానీ (32) మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై జయపురం వెళ్లి తిరిగి వస్తుండగా భూత్‌నాథ్ శ్మశానం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. భూత్‌నాథ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు పరీక్షల అనంతరం మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఆటో-బైకు ఢీ

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర జిల్లా పపదహండి సమితి జటకుగూడ సమీపంలో మంగళవారం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కమల్, ఆనంద్ ద్విచక్రవాహనంపై పపదహండి నుంచి తిరిగి వస్తున్నారు. అటుగా వస్తున్న ఆటో వీరిని ఢీకొంది. ఘటనా స్థలంలో కమల్ మృతి చెందగా, ఆనంద్ గాయపడ్డాడు. స్థానికులు నవరంగపూర్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు రెండు వాహనాలను సీజ్ చేసి, ఆటో చోదకుడు ధనపతి హరిజన్‌ను అరెస్టు చేశారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

యువతిపై అత్యాచారయత్నం

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ. 80 గ్రామంలో ఓ యువతి అత్యాచారానికి గురైంది. వివరాల్లోకి వెళ్తే శనివారం ఎంవీ 80 గ్రామంలో యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇంటి పక్కనే ఉన్న అశోక్ సర్కార్ గమనించి రాత్రి 1 గంటకు యువతి గృహంలో దూరి కత్తితో బెదిరించి అత్యాచారం చేశాడు. బాధితురాలి ఐదేళ్ల క్రితం తల్లి మృతి చెందగా తండ్రి, కూతురు నివసిస్తున్నారు. అత్యాచారంపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.


అబ్కారీ కానిస్టేబుల్‌పై దాడి: ఒకరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక టౌన్ ఠాణా పరిధిలోని టెలీఫోను భవన్ సమీపాన సోమవారం అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న అబ్కారీ విభాగం కానిస్టేబుల్ సవ్యసాచి మిశ్రా మరొకరు సాధారణ దుస్తుల్లో అక్కడికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మిశ్రా తన చరవాణిలో అక్కడి పరిస్థితి చిత్రీకరిస్తుండగా కొందరు ఆయనపై సామూహికంగా దాడి చేశారు. దాడిలో ఆయన కుడి కన్ను కింది భాగంలో తీవ్రగాయమైంది. ఈ ఘటనపై కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఒకర్ని అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలిస్తున్నామని ఠాణా ఐఐసీ సౌభాగ్య కుమార్ స్వయిన్ మంగళవారం విలేకరులకు చెప్పారు.

రూ. 2 లక్షల విలువైన సారా ధ్వంసం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా డీఎఫ్ఎస్ (జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్) జయపురం అబ్కారీ శాఖ సంయుక్తంగా మంగళవారం కంగా పంచాయతీ కదమగూడ ప్రాంతంలో సారా తయారీ బట్టీలపై దాడి చేశారు. 250 లీటర్ల విప్ప సారాను ధ్వంసం చేసినట్లు డీఎఫ్ఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్ర శేఖర్ పాఢి తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 2లక్షలు ఉంటుందని అబ్కారీ ఇన్‌స్పెక్టర్ శశికాంత్ దత్తా చెప్పారు. అక్రమంగా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మద్యం తాగడానికి పిలిచి హత్య


మిలన్ మజుందార్ (పాతచిత్రం)

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మద్యం తాగడానికి పిలిచి ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన మల్కాన్‌గిరి సమితిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మల్కాన్‌గిరిలో ఎంవీ 8 గ్రామానికి చెందిన మిలన్ మజుందార్(32)కు మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో మరో వ్యక్తి ఫోన్ చేసి మద్యం తాగాడానికి పిలిచారు. తిరిగి 9 గంటల సమయంలో ఆయన భార్య మిలన్‌ని ఫోన్ చేయగా, అతను కొంతమంది మిత్రులతో మాట్లాడుతున్నానని చెప్పారు. ఆ తర్వాత అతని దగ్గర నుంచి ఫోన్ రాలేదు. బుధవారం ఉదయం ఎం.వి. 8 గ్రామానికి సమీప మైదానంలో పడి ఉన్న ఆయన మృతదేహన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మృతదేహం మిలన్ మజుందార్‌దని గ్రామస్థులు గుర్తించారు. సంఘటనా స్థలంలో మద్యం సీసాలు, చెప్పులు పడి ఉన్నాయి. మిలన్‌తో ఎంతమంది మద్యం తాగడానికి వెళ్లారు. ఎవరు హత్య చేశారు. ఎందుకు హత్య చేశారనే అనే కోణంలో దర్యాప్తు జరుగుతుందని పోలీసులు తెలిపారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నదిలో గల్లంతైన ఓ యువకుని మృతదేహం 40 గంటల తర్వాత లభించింది. వివరాల్లోకి వెళ్తే సుందర్‌గడ్ జిల్లా దర్లిపల్లి ఎన్‌టీపీసీ విద్యుత్తు ప్లాంటులో పనిచేస్తున్న ప్రసాద్ ఇంటికి విశాకు చెందిన సాత్విక్(18) దసరా సెలవులకు వచ్చాడు. అక్టోబరు 13న స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లి సమీపంలోని ఎల్బీ నదిలో కాలు జారి పడి పోయాడు. అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం లభించినట్లు పోలీసులు వెల్లడించారు.

హోటల్ యజమాని ఇంట్లో చోరీ


ఇంట్లో పరిశీలిస్తున్న సైంటిఫిక్ బృందం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా కాశీనగర్ పట్టణం పర్లాఖెముండి, గుణుపురం ముఖ్య రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాశీనగర్ ఠాణా అధికారి సునీల్‌బెహరా తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని నివసిస్తున్న అభిరుచి హోటల్ యజమాని కనకరాజు పట్నాయక్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి గ్రామానికి వెళ్లారు. రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఓ బృందం చోరీ జరిగిన ప్రదేశానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మంగళవారం ఉదయం సైంటిఫిక్ బృందం జాగిలంతో పరిశీలించారు. యజమాని తెలిపిన వివరాలు మేరకు 10 తులాల బంగారం, రూ. 2 లక్షల 50 వేల నగదు దొంగలు దోచుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు బెహరా 'న్యూస్‌టుడే'కి వెల్లడించారు.

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం ఆదర్శనగర్ వీఐపీ లైన్‌లో బాలకృష్ణ అధికారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఐఐసీ రమణిరంజన్ దొళాయి తెలిపిన వివరాల ప్రకారం..బాలకృష్ణ మంగళవారం ఉదయం కుటుంబంతో కలిసి జగదల్‌పూర్ వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వచ్చేటప్పటికి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంటికివెళ్లి చూడగా బీరువాలో ఉన్న 40 తులాల బంగారం, రూ.2 లక్షల నగదును దుండగులు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బాధిత కుటుంబానికి మంత్రి బిభూతి పరామర్శ


మాట్లాడుతున్న మంత్రి బిభూతి

గోపాలపూర్, న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడు ఈ. గురుమూర్తి మృతదేహం సోమవారం రాత్రి గోపాల్‌పూర్ ఉప్పుటేరు పరిధిలోని చేపల సేకరించి కేంద్రం ఆవరణకు చేరింది. మంగళవారం బ్రహ్మపుర ఎమ్మెకేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో శవపరీక్ష జరిగింది. తరువాత మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో గోపాల్‌పూర్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్న రవాణా, వాణిజ్య, ఉక్కు, గనుల శాఖల మంత్రి బిభూతి భూషణ్ జెనా వచ్చారు. గురుమూర్తి భార్య, పిల్లల్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున ఆర్థికసాయం, బీమా తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

రహదారులు నిర్మించాలని విన్నపం


వినతులు ఇస్తున్న గ్రామస్థులు


రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే; రాయగడ జిల్లా కాశీపూర్ సమితి ఓడజోరు పంచాయతీలో వినతుల స్వీకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. తహసీల్దార్ సునాలి ప్రధాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫిర్యాదులు ఇచ్చేందుకు గ్రామీణులు వచ్చారు. తమ ఊళ్లకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. మొత్తం 53 వినతుల్లో 40 రహదారి సమస్యపై వచ్చాయని సమితి అదనపు అభివృద్ధి అధికారి పద్మిని తెలిపారు. వీటిని పాలనాధికారికి విన్నవిస్తామని తహసీల్దార్ చెప్పారు.

కొనసాగుతున్న ఆశాల నిరసన


కార్యాలయం వద్ద నిరసనలో బైఠాయించిన కార్యకర్తలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాష్ట్రంలో వివిధ చోట్ల ఆశా కార్యకర్తల సంఘాలు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జిల్లాలో మంగళవారం వందలాది కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పేరిట మంత్రికి, పాలనాధికారి శుభంకర్ మహాపాత్రోకు అందజేశారు.

మలయప్ప స్వామికి ఊంజల సేవ


ఊంజల సేవ నిర్వహిస్తున్న భాస్కారాచార్యులు, రాంజీ ఆచార్యులు

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో బాలాజీనగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి నిర్వహించిన ఊంజల సేవ కన్నుల పండువగా జరిగింది. ఆశ్వీయుజ మాసం శుక్ల పక్ష ద్వాదశి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఈ క్రతువు జరిగింది. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య కాగడా వెలుగుల్లో స్వామివారిని ఊరేగింపుగా దీప మండపానికి తీసుకువచ్చారు. వేయి దీపాల వెలుగుల్లో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కారాచార్యులు, రాంజీ ఆచార్యులు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిమజ్జన కోలాహలం


అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణంలో ఉన్న బాలాజీ మందిర్ పల్లి ఉన్నాయన్ సమితి 75వ దుర్గాపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జన శోభాయాత్ర చేశారు. 75 ఢాకీ వాయిద్యాలు, ఆదివాసీల సంప్రదాయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శోభాయమానంగా దుర్గమ్మల ఊరేగింపు


కార్నివాల్‌లో దుర్గమ్మ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ పట్టణంలో వైభవంగా దుర్గమ్మల ఊరేగింపు సోమవారం రాత్రి జరిగింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించారు. దుర్గమ్మల ఊరేగింపు బడ్తలా చౌక్ నుంచి గోకుల్ చౌక్ వరకు వేడుకగా జరిగింది. లైబ్రరీ రోడ్డులో ప్రధాన వేదికను ఏర్పాటు చేశారు. 17 దుర్గమ్మల విగ్రహాలు పాల్గొనడానికి నిర్వాహకులు అవకాశం కల్పించారు. జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి డాక్టర్ మానస్ రంజన్ భూయ, మిడ్నాపూర్‌లో లోక్‌సభ స్థాన సభ్యురాలు జూన్ మాలియా, జిల్లా సభాధిపతి ప్రతిభామైతి, పాలనాధికారి ఖుర్షీద్ ఆలీ ఖాదరీ, ఎస్పీ ధృతిమాన్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త పోలమ్మ ఉత్సవాలు


పూజలు అందుకుంటున్న అమ్మవారు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి బాగుసల గ్రామంలో కొలువైన కొత్త పోలమ్మ ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి దశమి నుంచి మారు దశమి వరకు కుమ్మరివీధిలో ఉంటుంది. ఆ తల్లిని మూలస్థానం నుంచి మేళతాళాలతో భక్తులు ఈ వీధికి తీసుకువస్తారు. ఇక్కడ మూడు రోజులు పూజలందుకుని అనంతరం ఘటాలతో ఊరేగించి తిరిగి మూలస్థానంలో ప్రతిష్ఠిస్తారు. బాగుసలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సంబరాలు ఏటా విజయనగరంలో పైడితల్లి అమ్మవారి ఉత్సవం నిర్వహించే సమయంలో జరుగుతాయని గ్రామస్థులు తెలిపారు.

17న కుమార పౌర్ణమి

గోపాలపూర్, న్యూస్‌టుడే: కుమార పౌర్ణమి ఎప్పుడు ఆచరిస్తారు? కార్తిక వ్రతాలు చేసేవారు ఎప్పుడు దీక్షలు చేపడతారన్నదిప్పుడు చర్చనీయాంశమైంది. దీనిపై పూరీ శ్రీక్షేత్ర పండిత సభ ప్రతినిధి పద్మనాభ త్రిపాఠి మంగళవారం వివరణ ఇచ్చారు. పౌర్ణమి గురువారం (17న) ఆచరిస్తారని, మరుసటి రోజు(18) శుక్రవారం నుంచి కార్తిక వ్రతధారులు దీక్షలు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన ఒడియా పంచాంగాల్లో పౌర్ణమికి సంబంధించి తేదీలు భిన్నంగా ఉన్నాయి. కొన్ని పంచాంగాల్లో 16న కుమార పౌర్ణమి అని, 17 నుంచి దీక్షాధారులు కార్తిక వ్రతాలు చేపట్టాలని ఉంది. ఇది వాస్తవం కాదని పద్మనాభ త్రిపాఠి చెప్పారు. శ్రీక్షేత్ర సేవల విభాగం సంచాలకుడు జతేంద్రసాహు విలేకర్లతో మాట్లాడుతూ శ్రీక్షేత్రంలో జగన్నాథుని కార్తిక సేవలు సోమవారం నుంచి ప్రారంభం కాగా, దీక్షాధారులు శుక్రవారం నుంచి చేపడతారన్నారు.

కాళీ మందిరంలో అగ్నిప్రమాదం


ఆలయంలో చెలరేగుతున్న మంటలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం పూర్ణగూడలోని కాళీమందిరంలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెండుగంటలు శ్రమించి మంటలను నియంత్రించారు. అఖండ దీపం కారణంగా మంటలు చెలరేగినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

ట్రక్కు బోల్తా-33 మందికి గాయాలు


ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన ట్రక్కు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా డాబుగావ్ సమితి సుండిగూడ మలుపు వద్ద ట్రక్కు బోల్తాపడి 27 మంది స్వల్పంగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. డాబుగావ్ ఐఐసీ సునీల్‌కుమార్ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు సమితి కెరండి గ్రామానికి చెందిన 40 మంది సోమవారం రాత్రి ట్రక్కులో పపదహండిలో కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా, సుండిగూడలో ఘాటీ వద్ద ట్రక్కు అదుపు తప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో నవరంగపూర్‌లో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

దుర్గా పూజల్లో ఇరువర్గాల కొట్లాట

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట పట్టణంలో దుర్గాపూజలు భారీ ఎత్తున నిర్వహించారు. పూజల్లో భాగంగా సోమవారం రాత్రి పట్టణంలోని బడొదండొ వీధి, ధారాకోట వీధుల్లో రామాయణం నాటకం ప్రదర్శనలు పోటాపోటీగా ఏర్పాటయ్యాయి. ఆయా వీధుల్లో కళాకారులు ఎత్తయిన క్రేన్‌లపై ఊరేగుతూ విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సమయంలో రెండు వీధులకు చెందిన కొందరు ఖాళీ నీటి సీసాలు, కొబ్బరి కాయలను ఒకరిపై ఒకరు విసురుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు లాఠీలు ఝుళిపించి ప్రజల్ని చెదరగొట్టారు. పరస్పర దాడుల్లో నలుగురు గాయపడగా, వారిని చికిత్సకు కళ్లికోటలోని ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వీరిలో తీవ్రంగా గాయపడ్డ ఒకర్ని ఎమ్మెకేసీజీ ఆసుపత్రికి తరలించారు. కళ్లికోట ఠాణా పోలీసులు సంఘటనా స్థలంలో ఒక పటాలం బలగాలను మోహరించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

★ బ్రహ్మపుర పెద్దబజారు ఠాణా పరిధిలో బ్రజరాజనగర్ నాలుగో లైనులోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి జూదం ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మందిని పట్టుకుని, వారి నుంచి రూ. 56,500ల నగదు, తొమ్మిది చరవాణులు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులు అధికారిక సమాచారం ఇవ్వలేదు.

అబ్దుల్ కలాంకు నివాళి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భారత దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక సిటీ హైస్కూల్లో ఓ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఆవరణలోని కలామ్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు పన్నగ భూషణ మాఝి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల 75 ఏళ్ల పండగలో అప్పటి రాష్ట్రపతి హోదాలో ఏపీజే అబ్దుల్ కలాం పాల్గొన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సిటీ హైస్కూలును మెచ్చిన ఆయన విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అందించేందుకు అప్పట్లో కంప్యూటర్లు కూడా అందజేశారని మాఝి పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


సిటీ హైస్కూలు ఆవరణలోని కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మాఝి. చిత్రంలో విద్యార్థులు


నివాళులర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ కార్యకర్తలు

నివాళులు...: పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజుగారి కోట వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు సోమవారం రాత్రి స్వర్గీయ పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా, అవయవదాన యోధుడు నరేష్ పట్నాయక్, హిందూ ధర్మం కోసం పోరాడిన కృష్ణచంద్ర దళపతిలకు నివాళులర్పించారు. పీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకనాథ్‌మిశ్రా, జిల్లా కార్యదర్శి గిన్ని కూర్మరెడ్డి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలో జయనగర్ ప్రాంతంలో మేఘమాల తోట సమీపంలో మంగళవారం పురపాలక ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా పూరిళ్లు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న వారికి గతంలో నోటీసులు పంపించామని ఎటువంటి స్పందన లేకపోవడంతో మంగళవారం జేసీబీతో వీటిని తొలగించామని ఈఓ సిద్ధార్థ్ పట్నాయక్ తెలిపారు.


జేసీబీ సహాయంతో ..

బహుముఖ ప్రజ్ఞాశాలి సతీష్ పాత్రో


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి జెనా, చిత్రంలో ఎమ్మెల్యే నాయక్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాజకీయ , సాహితీ రంగంలో దివంగత సతీష్ పాత్రో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అతిథులు పేర్కొన్నారు. సతీష్ పాత్ర్ స్మారక కమిటీ ఆధ్వర్యంలో పాత్ర్ మొదటి వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి హిల్‌పట్నాలోని గణేష మందిరం కల్యాణ మండపంలో ఓ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఉక్కు గనులు, రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అతిథులుగా బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, ఛత్రపురం శాసన సభ్యుడు కృష్ణచంద్ర నాయక్, భాజపా నేతలు కన్హుచరణ పతి, శిశిర పాఢి తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దివంగత సతీష్ పాత్ర్‌పై రూపొందించిన ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. నిర్వాహక కమిటీ కన్వీనరు మదన్ మోహన్ పాత్ర్, సమన్వయకర్త ఆచార్య ప్రఫుల్ల మహంతి తదితరులు పర్యవేక్షించారు.

క్రీడాశాఖ కమిషనర్ పర్యటన


గాలిగూడలో జీడితోట పరిశీలిస్తు న్న అధికారి, తదితరులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో రాష్ట్ర క్రీడా, యువజన వ్యవహారాల శాఖ కమిషనర్ భాస్కర్ జ్యోతిశర్మ మంగళవారం పర్యటించారు. మొదట నందహండి సమితి నిషానహండిలో 100 పడకల ప్రభుత్వ వసతిగృహాన్ని, టెంటులిఖుంటి సమితి బిర్జగూడలో హైటెక్ ఉద్యాన వనం, కోళ్లఫాం, మిషన్‌శక్తి రిటైల్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఆ తరువాత గాలిగూడలో జీడితోటను, చికిలీలో క్రీడా కాంప్లెక్స్, నవరంగపూర్ ఆసుపత్రిలో వైద్యసేవలు, ఆవాస్‌యోజనాలో భాగంగా నిర్మాణదశలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. జిల్లాలో సుభద్ర యోజనతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎంతవరకు అందుతున్నాయని ఆరా తీశారు. ఆయనతో పాటు పాలనాధికారి శుభంకర్ మహాపాత్ర్, ఎస్‌డీఓ బిరంచినారాయణ్, సీడీపీఓ మలాయి త్రిపాఠి తదితరులున్నారు.

మౌళిమా మందిరానికి గుర్తింపు తీసుకురావాలి


ఎమ్మెల్యే కడమ్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితిలోని దుదారిలో ఉన్న పురాతన మౌళిమా మందిరానికి గుర్తింపు తీసుకురావడమే పరబ్ వేడుకల ప్రారంభ ఉద్దేశమని పొట్టంగి ఎమ్మెల్యే రామ్ చంద్ర కడమ్ విలేకర్ల సమావేశంలో అన్నారు. ఆదివాసీల కళా సంస్కృతి పరిరక్షించే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా పరబ్ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఈ ఏడాది జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు వారి పరిధిలో పరబ్ వేడుకలు నిర్వహించాలన్న ప్రతిపాదనను కడమ్ వ్యతిరేకించారు. గత కొద్ది రోజులుగా జయపురం సబ్‌డివిజన్‌లో వేడుకలు ప్రారంభమవుతున్నాయని, చాల కాలంగా కొరాపుట్‌లో జరగడం లేదన్నారు. ప్రస్తుతం మౌళియా నుంచి నిర్వహించాలని కోరారు. ఈనెల 27వ తేదీన దుదారిలో అతి పురాతన మౌళిమా మందిరం నుంచి పరబ్ వేడుకలు ప్రారంభంకానున్నాయి.

వెబ్‌ఛానెళ్ల విలేకరుల అరెస్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కలహండి జిల్లా కేంద్రం భవానీపాట్నాలోని ఒక వ్యాపారిని మోసగించి రూ. 2.55 లక్షలు దోచుకున్న నలుగురు వెబ్‌ఛానెళ్ల రిపోర్టర్లు, వారికి సహకరించిన మరో వ్యక్తిని భవానీపాట్నా సదర్ ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ నెల 2న వ్యాపారిని మోసగించిన ఈ అయిదుగురు సొమ్ముతో పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి నిందితుల్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు.

వృద్ధులకు దుర్గమ్మల దర్శనం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వృద్ధాశ్రమంలో ఉంటున్నవారు పర్వదినాల సమయంలో కుటుంబసభ్యులతో గడపలేకపోతున్నామని మదన పడుతుంటారు. అటువంటి వారికి ఎస్సీ లెవన్ మిడ్నాపూర్ ఫుట్‌బాల్ జట్టు ఆనందం కలిగించింది. ఫుట్‌బాల్ జట్టు ప్రముఖుడు అబీర్ అగర్వాల్ అందించిన వివరాల ప్రకారం.. మిడ్నాపూర్ పట్టణ కేంద్ర బస్టాండు వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం నడుస్తోంది. అక్కడ ఉన్న 30 మంది వృద్ధులకు పండుగ రోజున ఆహారంతో పాటు దుస్తులు అందజేశారు. అనంతరం రిక్షాలపై సోమవారం దుర్గమ్మల దర్శనం చేయించారు. పలువురు వీరిని అభినందించారు.


దుర్గలను తిలకించడానికి వెళుతున్న వృద్ధులు

పట్టాలపై గున్న ఏనుగు మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గడ్ జిల్లా రవుర్కెలా నగరానికి చేరువలోని బందుముండలో సోమవారం రాత్రి ఒక ఏనుగు మృతిచెందింది. బందుముండ గ్రామంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించడంతో భయాందోళనకు గురైన ప్రజలు అటవీ శాఖాధికారులకు ఫోన్ చేశారు. అటవీశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకొని గ్రామస్థుల సాయంతో వన్యప్రాణులను అడవికి తరలించే ప్రయత్నం చేశారు. ఏనుగుల గుంపుపై సెర్చ్ లైట్లు వేశారు. ఈ కాంతిలో వన్యప్రాణులు చెల్లాచెదురు అయ్యాయి. ఒక గున్న ఏనుగు ముంబయి-హౌరా రైల్వే మార్గం ట్రాక్ వైపు పరుగులు తీసింది. అదే సమయంలో వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఘటనా స్థలంలో అది మృతిచెందింది. దీంతో కొద్ది నిమిషాలు రైలు నిలిచిపోయింది. ఏనుగును పట్టాలపై నుంచి కళేబరాన్ని తొలగించిన తర్వాత రైలు కదిలింది.

భారత్‌మాల పనులను సమీక్షించిన ఎమ్మెల్యే


సమావేశంలో ఎమ్మెల్యే కడమ్‌తో పాటు అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రాయ్‌పూర్ నుంచి ఆంధ్రాలో విశాఖపట్నం వరకు నిర్మిస్తున్న భారత్ మాల 6 లైన్ల సూపర్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం పనులను పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ మంగళవారం సమీక్షించారు. పొట్టంగి సమితి పెత్రు ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ ం పరిశీలించారు. అక్కడ కలిదిలో ఏర్పాటైన సమావేశంలో అధికారులతో సమీక్షించారు. ఈ పనులను నిర్వహించే సంస్థ అధికారులు నిర్మాణ పనుల గురించి ఎమ్మెల్యేకు తెలిపారు. ఎంపీ ప్రతినిధి శుక్లకోర, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సనత్ బంక, ప్రజాస కాంగ్రెస్ కమిటీ సభ్యులు గుప్తశంకర్ పట్నాయక్, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు అభి తదితరులు పాల్గొన్నారు.


దర్శనానికి వెళుతున్న గజపతులు

సిరులతల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం మంగళవారం వైభవంగా సాగింది. పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించగా.. భక్తులు మొక్కులు చెల్లించారు. వేలాదిమంది మహిళలు ఘటాలతో తరలివచ్చారు. కొందరు గొర్రెలు, మేకలు, కోళ్లను తల్లికి సమర్పించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, రఘురామ కృష్ణంరాజు, లోకం నాగమాధవి, బేబినాయన, కోళ్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

– ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్


సిరిమానుపై పూజారి వెంకటరావు


భక్తుల సందడి




సిరిమాను ఊరేగింపు


హుకుంపేటలో సిరిమానుకు పూజలు


భక్తుల సేవలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


పట్టువస్త్రాలతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆయన సతీమణి →

సిరిమానుపై ఇలవేల్పు వైభోగం




తల్లి సేవలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి


ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో


దర్శనానికి వెళుతున్న సినీనటుడు సుహాస్






ఉత్సవాన్ని వీక్షించేందుకు కోట పైకి వెళుతున్న అశోక్ గజపతిరాజు తదితరులు


దర్శనాలకు బారులు తీరిన భక్తులు


కోట పైనుంచి ఉత్సవాన్ని తిలకిస్తున్న పూసపాటి వంశస్థులు


పాలధార


ఏనుగు రథం


అంజలి రథం


బెస్తవారి వల

రీ సర్వేలో తప్పులపై సదస్సు

కొమరాడ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వేలో సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ శివయ్య తెలిపారు. మంగళవారం సివినిలో గ్రామసభలో మాట్లాడారు. సర్వేలో తప్పులను రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హక్కుదారు పేరు స్థానంలో పొరుగు పేరుందని, రామలవలసలో చెందిన భూమి వేరే విధంగా నమోదైందని, ఒక రైతుకు బదులు మరో రైతు పేరున సర్వే నంబర్లు నమోదు చేశారని తెలియజేశారు. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

గురుకులంలో అవగాహన సదస్సు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేటలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఎస్సై అమ్మన్నరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపైనే ధ్యాస పెట్టాలని సూచించారు. ఏఎస్సై సంజీవ, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై అమ్మన్నరావు

కుసిమిలో పల్లె పండుగ

సీతంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కుసిమి పంచాయతీలో మంగళవారం పల్లె పండుగ జరిగింది. గ్రామానికి మంజూరైన పనులకు తెదేపా నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో హిమరికి పవన్, ఎన్.చంద్రశేఖర్, ఎన్.నాగేశ్వరరావు, పి.శశికళ, మురళి, రాజబాబు, ఎంపీడీవో గీతాంజలి, ఏపీవో సాగర్ పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న నాయకులు

పరిశుభ్రతతో డెంగీ దూరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో డెంగీని అరికట్టవచ్చని జిల్లా మలేరియా సహాయ అధికారి సూర్యనారాయణ పేర్కొన్నారు. కురుపాంలో ఇటీవల డెంగీ బారిన పడిన వారిని జిల్లా కన్సల్టెంట్ రామచంద్రతో కలిసి పరిశీలించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కేసుల వివరాలు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్యసిబ్బంది కె.రాధాకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించేలా శ్రద్ధ వహించాలి

జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు అధిక దిగుబడులు సాధించేలా పంటలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏవో టి.జ్యోత్స్న, కేవీకే ఎస్ఎంఎస్ వై.ఉమాజ్యోతి పేర్కొన్నారు. జియ్యమ్మవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి తెగులు, కీటకాల నివారణపై అవగాహన కల్పించారు. ● గుమ్మలక్ష్మీపురంలో ఏవో ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ● బలిజిపేట మండలంలోని బర్లలో ఏవో ఏ.వి.ప్రవీణ్‌కుమార్, సర్పంచి అప్పలనాయుడు రైతులతో సమావేశమై సూచనలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జితేంద్ర, చరణ్, అఖి, చంద్, అఖిల్ చంద్రదేవ్ 68వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 19 వరకు నంద్యాలలో పోటీలు జరగనున్నాయి. హెచ్‌ఎం నాగరాజు, పీడీ మాధవరావు, సంరక్షకులు రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.3.50 లక్షల విలువైన గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణలోని భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో రూ.3.50 లక్షల విలువైన 12.5 కిలోల గంజాయి మంగళవారం పట్టుబడినట్లు ఆబ్కారీ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాలు, విశ్వసనీయ సమాచారంతో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం కలిమెల సమీపంలోని మల్కానగిరికి చెందిన ప్రదీప్ సర్కార్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని పాలగడ్డకు చెందిన ఇంద్రా ద్విచక్ర వాహనంపై రావడంతో ఆపి తనిఖీ చేయగా వారి వాహనంలో గంజాయి లభ్యమైంది. ఒడిశాలో కొనుగోలు చేసి హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వారు వెల్లడించారు. వాహనాన్ని సీజ్‌చేసి నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో కరీం, బాలు, సుధీర్, హనుమంతు, హరీష్, విజయ్ పాల్గొన్నారు.


గంజాయితో పట్టుబడిన నిందితులతో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

మల్లన్నా.. సమస్యలే స్వాగతమా..?

ఆలయంలో నిలిచిన నిర్మాణాలు

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

కలియుగ కైలాసంగా పేరొందిన రావివలస ఎండల మల్లికార్జునస్వామి శివక్షేత్రం కార్తిక మాసం ప్రారంభం నుంచే భక్తుల కోలాహలంతో రద్దీగా మారుతుంది. ఈ ఆలయాన్ని వైభవంగా తీర్చిదిద్దేందుకు 2014-2019 మధ్య అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చూపిన చొరవ గుడి ప్రాభవాన్ని పెంచింది. ఆ సమయంలో రూ.75 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాకార మండప నిర్మాణంతో కొత్త శోభ సంతరించుకుంది. ఈ దశలోనే రావివసలో మెట్‌కోర్ ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమను నిర్వహణకు తీసుకున్న అభిజిత్ ఫెర్రోటెక్ యాజమాన్యం రూ.కోటి నిధులను మల్లన్న ఆలయ అభివృద్ధి కేటాయిస్తామని ప్రకటించి రూ.60 లక్షల వరకు పనులు చేపట్టింది. పరిశ్రమ మూతపడటంతో అక్కడితో ఆ నిర్మాణాలు ఆగిపోయాయి. ఓవైపు రూ.75 లక్షల నిధులతో చేపట్టాల్సిన పనులు కొన్నిచోట్ల నిలిచిపోయాయి.


రావివలస ఎండల మల్లన్న క్షేత్రం



నిలిచిన నవగ్రహ మండపం నిర్మాణం

వస్తోంది కార్తీకం..

జిల్లాతో పాటు ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రావివలసలోని ఎండల మల్లన్న దర్శనానికి భక్తులు తరలివస్తారు. ప్రత్యేకించి ఈ మాసంలో సోమవారాల్లో లక్షలాదిగా వస్తారు. అందుకు తగ్గట్టుగా దేవాదాయశాఖ ఏటా ఏర్పాట్లు చేస్తూ వస్తోంది. అయితే ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేకించి ఉచిత దర్శనాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ప్రసాదాల విక్రయాల్లో అధికధరలు వసూలు చేస్తుండటంతో పాటు నాణ్యత పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మధ్యలో ఆగిపోయాయి

- ఆలయంలో ప్రాకార మండపంతో పాటు స్వామివారి శీర్షాభిషేక మండపం వంటి పనులు పూర్తయ్యాయి. ఉపాలయాలు, నవగ్రహ మండపం, కేశఖండనశాల వంటివి మధ్యలో ఆగిపోయాయి.
- ప్రాకార మండపంపై శాలాహారం నిర్మిస్తే ఆలయానికి కొత్తరూపు వస్తుందని అర్చకులు చెబుతున్నారు. వీటిని పూర్తిచేసేందుకు అటు దాతలను సమీకరించడం, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడంపై గానీ త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- భోగశాల, అర్చక విశ్రాంతి గది సైతం ఇక్కడ అందుబాటులో లేవు. సీత పుష్కరిణికి ఒకవైపే మెట్లు ఉన్నాయి. మిగిలిన రెండువైపులా ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- మరుగుదొడ్ల నిర్మాణాన్ని సైతం మధ్యలోనే వదిలేశారు. దేవస్థానం వద్దకు వచ్చే భక్తులకోసం విశ్రాంతి మండపాలు, ఆలయం చుట్టూ రక్షణగోడ నిర్మాణాలు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుంది.
- నౌపడ - మెళియాపుట్టి రహదారిలో రావివలస కూడలివద్ద, గ్రామంలో ఆలయానికి వెళ్లే మార్గం కూడలి వద్ద భారీ ముఖద్వారాలు ఉండేవి. అవి గతంలో తుపాన్ల సమయంలో కుప్పకూలాయి.


మెట్లు నిర్మించాల్సిన సీత పుష్కరిణి

నిధుల మేరకు పనులు చేశాం.. రావివలస దేవస్థానంలో దేవాదాయశాఖ నిధులు ఉన్నంతవరకు అభివృద్ధి చేశాం. కొత్తగా మరికొన్ని ప్రతిపాదనలు చేస్తే నిధులు మంజూరైన వెంటనే పనులు జరిపిస్తాం.

– కేవీసీ కృష్ణమూర్తి, డీఈఈ, దేవాదాయశాఖ

గరుగుబిల్లికి జంఝావతి నీరు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలానికి నాలుగు రోజుల్లో జంఝావతి కాలువ నుంచి సాగు నీరు తీసుకొచ్చేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. ఉల్లిభద్ర వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు ఎ.మధుసూదనరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు నీరు అందడం లేదన్నారు. శివ్వాంలో రూ.3 లక్షలతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాయకులు డి.సత్యనారాయణనాయుడు, ఎ.తవిటినాయుడు, కె.భరత్, శంకరరావు, పి.పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కప్పేసిన పొదలు.. కనిపించదసలు

మందస మండలం సువర్ణాపురం-ఉగ్రవానిపేట మధ్య సిమెంటు రహదారి ఇది. అర కిలోమీటరు దూరం ఉంటుంది. రెండు వైపులా పొదలు అల్లుకొని ఇరుకుగా మారింది. ఎలుగుబంట్లు సంచరించే ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ రహదారిలో పొదలు మొత్తం తొలగించే చర్యలు చేపడతామని సర్పంచి విజయలక్ష్మి తెలిపారు.

–న్యూస్‌టుడే, హరిపురం (మందస)



ఆదివాసీల అభ్యున్నతికి కృషి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. నీలకంఠాపురం పంచాయతీలోని చింతమానుగూడలో గిరిజన కళాక్షేత్రం, మినీ మ్యూజియం ప్రారంభించారు. పీవో మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి పరిరక్షణ, జానపద కళల ప్రోత్సాహకాలకు తోడ్పాటు అందిస్తామన్నారు. మ్యూజియంలోని వేట సాధనాలు, వన మూలికలు, ఉపకరణాలు తిలకించారు. అనంతరం మంత్రజోల గ్రామంలోని వికాస కేంద్రాన్ని పరిశీలించి చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ యూనిట్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.మన్మథరావు, ఆదివాసీ గిరిజన నాయకులు రామకృష్ణ, చంద్రశేఖర్, రామారావు, నీలకంఠం, కడాయి, పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


పదార్థాలు పరిశీలిస్తున్న పీవో

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.55 కోట్లు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మహిళల స్వయం ఉపాధికి అనుగుణంగా యూనిట్ల ఏర్పాటుకు రూ.55 కోట్లు స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా సహాయ జనరల్ మేనేజర్ హేమలత తెలిపారు. గుమ్మలక్ష్మీపురం వెలుగు కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశమయ్యారు. మొత్తం 11 వేల మంది సభ్యులకు రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు 4 వేల మందికి రూ.23 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఏపీఎం ఆదయ్య, సీసీలు ఉన్నారు.

కాలువ ఉన్నా.. నిరుపయోగం



ఇచ్ఛాపురం పురపాలకసంఘ పరిధి రత్తకన్న ప్రధాన మార్గంలో నాయుడువీధి, ఒడియా వీధి నడుమ కాలువ పూర్తిగా ధ్వంసమైంది. వర్షం పడితే కాలువలో ఉండే మురుగు రోడ్డుపైకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖద్వారం నుంచి చివరవీధి వరకూ కలుపుతూ వరదనీటి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయమై పుర కమిషనర్ రమేష్ స్పందిస్తూ, కాలువ ప్రాంతాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

తాగునీటి కొరత

పలాస మండలం హిమగిరిలో తాగునీటి కోసం గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు సరఫరా చేసే కుళాయిల ద్వారా నీరు రావడం లేదని, వచ్చిన నీరు గ్రామంలో సగం మందికి కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిక్కులేని పరిస్థితిలో బావిలోని నీరు తెచ్చుకుంటున్నామని చెబుతున్నారు. ఇదే విషయం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ ధనుంజయ దృష్టికి తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం



రాకపోకలకు అవస్థలు

వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లేందుకు సరైన రహదారి మార్గం లేకపోవడంతో పీహెచ్‌సీకి వెళ్లే రోగులు, సిబ్బంది నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉద్దానం ప్రాంతం నుంచి వచ్చే రోగులు రైల్వే గేటుతో అవస్థలు తప్పడం లేదు. పక్కా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో రమేశ్‌నాయుడు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

–న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

